ప్రజాశక్తి

ఆదివారం 19 మార్చి 2023 5

పార్వతీపురం మన్యం

జాతీయ సేవా దళం కార్యకర్తలకు దరఖాస్తులు ఆహ్వానం

కలెక్టరేట్ : జాతీయ సేవా దళం కార్యకర్తలుగా పనిచేసేందుకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.వెంకట ఉజ్వల్ తెలిపారు. 2023 ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 నుండి 29 సంవత్సరాల వయసు కలిగి, కనీసం పదో తరగతి విద్యార్హత గలవారు అర్హులని చెప్పారు. వాలంటీర్లుగా స్వచ్ఛంద సేవచేసే స్వభావం ఉండాలని తెలిపారు. కంప్యూటర్ అప్లికేషన్స్, ఆండ్రాయిడ్ మొబైల్ అప్లికేషన్స్, ఈ బ్యాంకింగ్, డిజి ధన్ వంటి అప్లికేషన్లపై అవగాహన, ఇతర సాంకేతిక ఉన్నత విద్యార్హత, మహిళా అభ్యర్థులకు, నెహ్రూయువకేంద్ర అనుబంధ సంఘాల సభ్యులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.5వేలు గౌరవ వేతనం చెల్లిస్తామన్నారు. అభ్యర్థులు ఆన్లైన్‌లో www.nyks.nic.in వెబ్‌సైట్ ద్వారా గానీ, వ్యక్తిగతంగా గానీ దరఖాస్తు చేయాలని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24లోగా దరఖాస్తు చేయాలని సూచించారు.

గిరిజనులకు మిగిలేది 'చింతే'

- మద్దతు ధర లేక నష్టాల పాలు
- నాణ్యత లేదని పంపిస్తున్న జిసిసి
- దళారుల చేతిలో మోసపోతున్న గిరిజనులు

సంతలో విక్రయానికి గిరిజనులకు తీసుకొచ్చిన చింతపండు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

మన్యం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో గిరిపుత్రులు తరతరాల నుంచి అడవినే నమ్ముకుని పోడు వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఏటా పండే ప్రధాన పంటలైన చింతపండు, జీడిపై ఎక్కువ శాతం ఆధార పడుతున్నారు. ఈ ఏడాది జీడిపంట దిగుబడి లేకపోవడంతో చింత పంట పైనే ఎక్కువ శాతం ఆశలు పెట్టుకున్నారు. చింతపండు సేకరణ కోసం పిల్లాపాపలతో కొండలు, గుట్టలపై ఉన్న చింత చెట్ల వద్దకు వెళ్లి ఎంతో కష్టపడి బొట్టలు ఏరి చింతపండు అమ్మకానికి కిలోమీటర్ల కాలినడకన మండల కేంద్రానికి, వారపు సంతలకు, జిసిసి ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకెళు తున్నారు. చింతపండు సేకరణలో వ్యయ ప్రయాసలు పడుతున్న గిరిజనులకు గిట్టుబాటు ధర లేక చివరకు చేసేది లేక తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుంది. మరోవైపు జిసిసి నిబంధనలు గిరిపుత్రులకు ఆందోళన కలిగిస్తున్నాయి. జిసిసి కొనుగోలు కేంద్రాలకు గిరిజనులు చింతపండు అమ్మకానికి తీసుకెళ్తే నాణ్యత లేదని, పొడిగా లేదని, తడిచిన చింతపండు తీసుకువచ్చారని జిసిసి సిబ్బంది చెప్పడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిసిసి కిలో చింతపండు రూ.32.40 పైసలు మాత్రమే ధర నిర్ణయించడంతో దళారులను ఆశ్రయిస్తున్నారు.

గత ఏడాది ఇదే తంతు....

గత ఏడాది గిరిజనులు సేకరించిన చింతపండు కొనుగోలు చేయడంలో జిసిసి అధికారులు ఆన్లైన్ చెల్లింపులు విధానం తీసుకొచ్చారు. గిరిజనుల నుంచి అధికారులు ముందుగా చింతపండు కొనుగోలు చేసి డబ్బులు బ్యాంకు అకౌంట్లో వేస్తామని చెప్పడంతో చింతపండు అమ్మేందుకు గిరిజనులు ముందుకు రాలేదు. బయట మార్కెట్లో వర్తకులకు తప్పని పరిస్థితుల్లో తక్కువ ధరకే అమ్ముకొని తీవ్రంగా నష్టపోయారు.

పదివేల క్వింటాళ్ల దిగుబడి

జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియమ్మవలస, కొమరాడ, పాచిపెంట, మక్కువ, సీతంపేట, భామిని, సాలూరు మండలాల్లో 70 వేలకు పైగా చింత చెట్లు ఉన్నట్లు అంచనా. ప్రతి ఏటా పదివేల క్వింటాళ్ల వరకు చింతపండు దిగుబడి వస్తోందని అంచనా. గిరిజనులు సేకరించిన చింతపండును గిరిజన సహకార సంస్థ కొనుగోలు చేస్తుంది. అనంతరం టెండర్లు పిలిచి వర్తకుల ద్వారా మైదాన ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. జిసిసికి జిల్లాలో కోల్డ్ స్టోరేజ్ లేకపోవడంతో పంట నిల్వలను ఇతర ప్రాంతాల్లో భద్రపరచాల్సిన పరిస్థితి నెలకొంది. జిసిసి నెల నెలా టన్నుల లెక్కన అద్దె చెల్లించాల్సి వస్తోంది. ఏటా గిరిజనులు సేకరిస్తున్న చింతపండుకు టెండర్లు పిలుస్తున్నప్పటికీ జిసిసి కొనుగోలు చేస్తున్న ధర రావడం లేదు. దీంతో ఆ సంస్థ పూర్తిస్థాయిలో కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. నాణ్యత లేదని, తడిపిన చింత పండు తీసుకొస్తున్నారని రకరకాల కారణాలు చూపుతూ అంతంతమాత్రంగానే అధికారులు కొనుగోలు చేస్తున్నారని గిరిజన సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

తప్పని దళారుల బెడద

గిరిజనులు సేకరిస్తున్న చింతపండు నాణ్యత లేదని జిసిసి అధికారులు కొనుగోలు చేయకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించి తక్కువ ధరకే పంట మొత్తాన్ని అమ్ముకోవాల్సి వస్తోంది. గిరిజనుల నుంచి చింతపండు కొనుగోలు చేసిన వర్తకులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచి మంచి ధర పలికినప్పుడు విక్రయిస్తున్నారు. ఎంతో కష్టపడి చింతపండు సేకరిస్తున్నా గిట్టుబాటు ధర లేకపోవడంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారు.

నిబంధనలు సరికావు

గిరిజనుల నుంచి చింతపండు కొనుగోలు చేస్తున్న జిసిసి పలు నిబంధనలు పెట్టడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. చింతపండు సేకరణలో నాణ్యత లేదని, తడిపి తీసుకొస్తున్నారని అధికారులు చెప్పడంతో తక్కువ ధరకే బయట వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తుంది. గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన జిసిసి ద్వారా గిరిజనులు సేకరించిన అన్ని రకాల అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలి.

మండంగి రమణ,
ఎపి గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు.

పొడి చింతపండునే కొనుగోలు చేస్తాం

గుమ్మలక్ష్మీపురం జిసిసి ద్వారా తాడికొండ, గుమ్మలక్ష్మీపురం, దేరువాడ, దుడ్డుఖల్లు, నీలకంఠాపురం, వంగర, వలసబల్లేరు, గొరడ, మొండెంఖల్ గ్రామాల్లో చింతపండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. గిరిజనులు సేకరిస్తున్న పొడి చింత పండు మాత్రమే కొనుగోలు చేస్తాం. తడి చింతపండు కొనుగోలు చేసే ప్రసక్తే లేదు. దళారులు కిలో చింతపండు రూ.25కు కొనుగోలు చేస్తే జిసిసి రూ.32కు కొనుగోలు చేస్తుంది.

వి.కృష్ణ ప్రసాద్,
జిసిసి మేనేజర్, గుమ్మలక్ష్మీపురం.

పలుచోట్ల వర్షాలు

గాలులతో నేలకొరిగిన అరటి , మొక్కజొన్న • కంట్రోల్ రూం ఏర్పాటు

సాలూరులో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి-విలేకర్ల యంత్రాంగం

ఉత్తర తమిళనాడు నుంచి కర్నాటక మీదుగా కొంకణ్ తీరం వరకు అల్పపీడనం ద్రోణి కొనసాగడంతో జిల్లాలో శనివారం పలుచోట్ల వర్షాలు కురిశాయి. సీతంపేటలో ఎడతెరిపిలేని వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. మక్కువ, సాలూరులో ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. పలుచోట్ల పడిగులు కూడా పడ్డాయి.

సీతంపేటలో కుండపోత వర్షం

సీతంపేట : మండల కేంద్రంలో కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షం జీడి మామిడి పంటలకు అనుకూలంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

అరటి పంట నష్టం

వీరఘట్టం : మండలంలో శనివారం వీచిన పెనుగాలులతో అరటిపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలోని కిమ్మికి చెందిన రైతు సోమినాయుడు, త్రినాధ నాయుడు, పోలినాయుడుకు సుమారు మూడున్నర ఎకరాల అరటి పంట నేలకొరిగింది. అలాగే చిట్టిపూడి వలస, విక్రాంపురం, కంబరవలస, కంబర, నడిమికెళ్ల తదితర గ్రామాల్లోనూ పెనుగాలులకు పంట నాశనమైనట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ వర్షానికి మురికి కాలువల్లో నీరు నిండిపోవడంతో రోడ్డుపైకి మురికినీరు ప్రవహిస్తుంది. పెనుగాలులతో పాటు వర్షం కురవడంతో కంబర- కంబర వలస గ్రామాల మధ్య రెండు విద్యుత్ స్తంభాలు నేల కొరగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో పల్లె ప్రాంతాల ప్రజలు అంధకారంలో కాలం గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మ లక్ష్మీపురం ఏజెన్సీలో శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో ప్రజలు, వ్యాపారులు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కురిసిన వర్షంతో పలుచోట్ల రోడ్లు బురదమయంగా మారాయి.

350 ఎకరాల మొక్కజొన్నకు నష్టం

కొమరాడ : మండలంలో వీచిన ఈదురుగాలులకు 350 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిలినట్లు రైతులు తెలుపుతున్నారు. చేతికి అంది వచ్చిన సమయంలో మొక్కజొన్న పంట పూర్తిగా నేలమట్టం కావడంతో మొక్కజొన్న రైతులు ఆందోళన చెందుతున్నారు. నష్టపోయిన పంటను ఎఒ శంకరరావు ఆధ్వర్యంలో సిబ్బంది నివేదికలు సిద్ధం చేస్తున్నారు. అనంతరం ఎఒ మాట్లాడుతూ మండలంలోని నాలుగు గ్రామాల్లో 144 మంది రైతులకు చెందిన సుమారు 350 ఎకరాల్లో మొక్క జొన్న దెబ్బతిందన్నారు. కురుపాం ఎడి అలజంగి నిర్మలజ్యోతితో కలిసి పంట పొలాలను పరిశీలించినట్టు తెలిపారు.

వీరఘట్టం : కిమ్మిలో నేలకొరిగిన అరటి పంట

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

పార్వతీపురం : వాతావరణ శాఖ హెచ్చరిక మేరకు జిల్లాలో కురుస్తున్న వర్షాలకు కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం 08963 - 293046 ఏర్పాటు చేశారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ జిల్లా యంత్రాంగాన్ని శనివారం అప్రమత్తం చేశారు. కంట్రోల్ రూంలో రెవిన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. వర్షాల వల్ల కలిగే నష్టాలు, సహాయక చర్యలకు కంట్రోల్‌రూంకు సమాచారం అందించాలని కోరారు.

రక్తహీనతను అధిగమించాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి - కలెక్టరేట్

అంగన్వాడీ కేంద్రాల పరిధిలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం కింద చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు శత శాతం పౌష్టికాహారం అందించి రక్త హీనత లోపాన్ని అధిగమించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి మహిళా, శిశు సంక్షేమ అధికారులు, అంగన్వాడీ సూపర్వైజర్లతో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం అమలు, బాల్య వివాహాల నిర్మూలనకు చేపడుతున్న చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం ప్రాంతంలో పేద మహిళలు ప్రసవ సమయంలో రక్తహీనత, హిమోగ్లోబిన్ శాతం లోపం వల్ల ప్రాణాపాయ స్థితికి వెళ్లే సందర్భాలు ఉన్నాయని, మానవతా దృక్పథంతో విధిగా పౌష్టికాహారం సక్రమంగా శతశాతం చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందేలా పక్కా ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం రక్తహీనత నివారణ, బాల్యవివాహాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందిస్తున్న లబ్ధిదారుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.విజయగౌరి మాట్లాడుతూ వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ క్షేత్ర స్థాయిలో కొంత మందికి అందడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయని, కారణాలను విచారించి అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి, పనితీరుపై స్థానికుల వద్ద ఆరా తీయాలని సూచించారు. గ్రామ సచివాలయంలో రక్త హీనత లోపం ఉన్న వారి జాబితా గోడపై ప్రదర్శించాలని లేని పక్షంలో సంబంధిత ఎంపిడిఒ, సిడిపిఒ, సూపర్ వైజర్లు బాధ్యత వహించాలని తెలిపారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం అందిన వెంటనే స్పందించాలన్నారు. వీటిపై ఉదాసీనత ప్రదర్శిస్తే సంబంధిత గ్రామ సచివాలయం మహిళా పోలీస్, చైల్డ్ లైన్, ఐసిడిఎస్ అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

660మంది విద్యార్థులు గైర్హాజరు

మక్కువలో కుర్చీలు, బెంచీలపై కూర్చొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఇంటర్ ద్వితీయ సంవత్సర ఇంగ్లీష్ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగిందని డివిఇఒ కె.మంజుల వీణ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షకు 6,766మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 660మంది గైర్హాజరైనట్టు తెలిపారు. అయితే డిబార్లు ఎక్కడా లేవన్నారు.

వీరఘట్టం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్మీడియట్ ద్వితీయ పరీక్షకు సంబంధించి 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సిఎస్ పి.శంకరరావు తెలిపారు. 250 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 8మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదన్నారు. ఈ పరీక్షా కేంద్రాన్ని ఆర్ఐఒ ఎస్.తవిటినాయుడు పరిశీలించారు.

పాలకొండ : స్థానిక ఎలైట్ కాలేజీలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను ఆర్ఐఒ ఎస్.తవిటి నాయుడు పరిశీలించారు. పకడ్బందీగా పరీక్షలు జరపాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి అన్నారు.

అసౌకర్యాల నడుమ ఇంటర్ పరీక్ష

మక్కువ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలకు అసౌకర్యాలతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. సుమారు 466 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. అయితే విద్యార్థులందరికీ సరిపడా బెంచీలు లేకపోవడంతో కుర్చీలు పైనే కూర్చొని పరీక్షలు రాసే పరిస్థితిని విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. సుమారు మూడు గదుల్లో ఇలాంటి ఇబ్బందులకు గురవుతున్నారు. నాడు -నేడు ద్వారా రావాల్సిన బెంచీలు ఇతరత్రా సామాగ్రి ఇంకా కళాశాలకు చేరకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. పలు నిబంధనలతో ఇప్పటికే పరీక్ష రాసేందుకు విద్యార్థులు అవస్థలుపడుతున్నారు. కుర్చీలపై కూర్చొని అట్లపై పరీక్ష రాయడం ఇబ్బందిగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. శనివారం 20 నిమిషాల ఆలస్యంగా పరీక్షా కేంద్రానికి ముగ్గురు విద్యార్థులు రావడంతో వారు వెనుదిరిగారు.

ప్రజలను దోచుకుంటున్న బిజెపి : కాంగ్రెస్

ప్రజాశక్తి-విజయనగరం కోట

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలను నిట్టనిలువునా దోచుకుంటోందని రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసెడెంట్ రాకేష్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. సమస్యలపై పోరాడితనే పార్టీ బలపడుతుందన్నారు. ఈనెల 19నుంచి నెలరోజుల పాటు ప్రజల్లోకి ఈ కార్యక్రమాన్ని తీసుకెళ్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి చెంపదెబ్బ తగిలిందన్నారు. డబ్బు, వెండి నాణేలు పంచి, దొంగ ఓట్లు చేర్పించి ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా వైసిపికి ప్రజలకు బుద్ధి చెప్పారన్నారు. ప్రజల్లో వైసిపి పట్ల వ్యతిరేకత రోజు రోజుకూ పెరుగుతోందన్నారు. వచ్చే నెలలో రాహుల్‌గాంధీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించనున్నారని తెలిపారు.

రోడ్లు లేని గ్రామాల గుర్తింపునకు సర్వే

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో రహదారుల్లేని గ్రామాలను గుర్తించేందుకు అటవీ, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్త సర్వే నిర్వహించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. అటవీ ప్రాంతంలో రహదారుల నిర్మాణంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం శనివారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రహదారుల్లేని గ్రామాల వివరాలపై ప్రాథమిక సమాచారం సేకరించాలన్నారు. రహదారులకు అటవీ భూమి ఎంత పరిమాణం అవసరం వంటి విషయాలు వివరంగా అంచనా వేయాలని సూచించారు. అటవీ ప్రాంతంలో ఏడు రహదారుల నిర్మాణానికి వాటి ప్రాధాన్యత దృష్ట్యా జిల్లా స్థాయి కమిటీ తీర్మానించి, మంజూరు చేసింది. అందులో గుమ్మలక్ష్మీపురం మండలం కొత్తగూడ - జడ్డ, జడ్డ - మంత్రజోల, గొరడ జంక్షన్-బయ్యాడ, ములుగూడ ఆర్అండ్‌బి రహదారి నుంచి గొరడ జంక్షన్, పాములగీసాడ - కొత్తగూడ రహదారులు, కురుపాం మండలంలో జి.శివడ - మడ్డుగూడ, కొమరాడ మండలంలో కొండ కునేరు - పెదశాఖ రహదార్లు ఉన్నాయి. సమావేశంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, డిఎఫ్ఒ జిఎపిప్రసూన, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారి జె.శాంతీశ్వర రావు, ఐటిడిఎ ఎపిఒ సురేష్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, కమిటీ సభ్యులు కొర్రజన్ని సింహాచలం, మండంగి రాధిక తదితరులు పాల్గొన్నారు.



పిహెచ్‌సిలో ఎయిడ్స్ నివారణా మందులను, పరీక్ష విధానాన్ని అడిగి తెలుసుకుంటున్న జెడి కామేశ్వర ప్రసాద్

రాష్ట్రంలో 2.13లక్షల ఎయిడ్స్ కేసులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రంలో 2 లక్షల 13వేలు ఎయిడ్స్ యాక్టివ్ కేసులున్నట్లు రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వరప్రసాద్ తెలిపారు. కురుపాం నియోజకవర్గంలోని చిన మేరంగి, గుమ్మలక్ష్మీపురం సామాజిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిల పరిధిలో నెలకు ఎన్ని ఎయిడ్స్ కేసులు నమోదు అవుతున్నాయి, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, రోగులకు చేస్తున్న పరీక్షలు, అందిస్తున్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గుమ్మలక్ష్మీపురంలో ఎయిడ్స్ పరీక్షా కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నిస్తామని అన్నారు. ఫిబ్రవరిలో రాష్ట్రంలో 14వేలు హెచ్ఐవి కేసులు నమోదైనట్లు చెప్పారు. 256 ఐసిటిసి కేంద్రాల్లో ఎయిడ్స్ వ్యాధి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోజురోజుకూ ఎయిడ్స్ కేసుల సంఖ్య తగ్గుతుందన్నారు. ఎయిడ్స్ నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు బిగౌరీశంకర్రావు, స్థానిక సిహెచ్‌సి వైద్యులు రవికుమార్, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

కురుపాం : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఎపి రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఎపిడి వై.కామేశ్వరప్రసాద్ అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో గల రికార్డులను , ల్యాబ్ గదులను క్షుణంగా పరిశీలించి అనంతరం కౌన్సిలర్ ఎ.మోహన్ రావుకు ఎయిడ్స్ కేసులకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మెలిగే విధానం రికార్డులు నిర్వహణ ల్యాబ్ నిర్వహణ తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ శోభారాణి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మండలి ఫలితాల్లో

ఉత్తరాంధ్ర సమస్యల ఎజెండా ఎంత?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'రాజకీయాలు క్రమబద్ధంగా సంస్థాగతం చేసిన విద్వేషాలు' అంటూ చాటిచెప్పిన ప్రష్యన్ రాజనీతివేత్త బిస్మార్క్ మాటలు నిజం కాకుండా పోలేదనడానికి ఇటీవల జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలే తార్కాణం. ఉత్తరాంధ్ర ప్రాంతం వెనుకబాటు నివారణకు ఆర్థిక ప్యాకేజీ, లక్షల ఎకరాలకు సాగునీరందించగలిగే సుజల స్రవంతి, వేల మంది కార్మికులు ఆధారపడే వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం రెండేళ్లుగా పోరాడుతున్న కార్మికుల పక్షాన నిలబడాలనే ప్రధాన సమస్యలేవీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెద్దగా అజెండా కాలేదు. స్థానిక పరిస్థితులు, రాజకీయ పార్టీలు బలపరిచిన వ్యక్తులు, సామాజిక తరగతులు, డబ్బు పంపకాలు చుట్టూ ఈ ఎన్నికలు తిరిగాయి. అజెండా ప్రాతిపదికగా ఒక్క ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ, ఆమెను బలపరిచిన బహుళ సంఘాల ప్రచారం మినహాయిస్తే ఈ ఎన్నికల్లో అజెండాగా కనీస ప్రస్తావన కూడా వైసిపి, టిడిపి, బిజెపిలు చేయకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర ప్రాంతానికి తీరని అన్యాయం చేస్తోన్న కేంద్రంలోని బిజెపికి, ఆ పార్టీ బలపరిచిన అభ్యర్థి పివిఎన్ మాధవ్‌కు పట్టభద్రులు డిపాజిట్ లేకుండా చేశారు.

వైసిపి వ్యతిరేక ప్రచారం టిడిపికి కలిసొచ్చిందా?

ఈ ఎన్నికల్లో ఓటర్లలో ఎక్కువ మంది పట్టభద్రులు మధ్యతరగతికి చెందిన వారే కావడంతో టిడిపి, జనసేన పార్టీలు ఇటీవల కాలంలో నిర్వహిస్తున్న వైసిపి ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం టిడిపికి కొంత కలిసొచ్చింది. విశాఖలో భూ కబ్జాలకు వైసిపి పాల్పడుతుందని, రుషికొండ ధ్వంసం వంటి అంశాలూ అంతర్గతంగా ఓటర్లపై పనిచేశాయన్నది తాజాగా చర్చ సాగుతోంది. టీచర్లు, ఉద్యోగులను జగన్ సర్కారు నిర్లక్ష్యం చేస్తూ సంక్షేమం పేరుతో పథకాలకు నగదు బదిలీ చేస్తూ తమ జీతాలు, డిఎలను ఎగ్గొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలపైనా పట్టభద్రులు ఓటు ద్వారా స్పందించినట్లు రూఢీ అవుతోంది. అధికార పార్టీ అర్థబలం, అధికార దర్పాన్ని ఉపయోగించినా పట్టభద్రులంతా ఆ పార్టీపై ప్రతాపం చూపారు.

సాధారణ ఎన్నికల్లో ఏ ప్రభావాలైతే పనిచేస్తాయో...

జనరల్ ఎన్నికల్లో ఏ అంశాలైతే ఓటర్లను ప్రభావం చేస్తాయో మేధావులు, విజ్ఞులైన పట్టభద్రులపైనా అటువంటి ప్రభావాలే కనిపించాయి. అభ్యర్థుల ఎంపిక కూడా సామాజిక తరగతుల ఓటింగ్ ప్రకారమే ఆయా ప్రధాన పార్టీలు ప్రకటించాయి. వైసిపి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఉన్న సీతం రాజు సుధాకర్‌ను, టిడిపి ఉత్తరాంధ్రలో ప్రభావం చూపించగలిగే సామాజిక తరగతి 'కాపు'ల నుంచి వేపాడ చిరంజీవిరావును బరిలోకి దించింది. పిడిఎఫ్ తరపున డాక్టర్ కోరెడ్ల రమాప్రభను 250 ప్రజా సంఘాలు కులాతీత, ప్రాంతాలకు అతీతంగా మద్దతు ఇచ్చి పిడిఎఫ్ తరపున నిలబెట్టాయి. అన్ని తరగతుల ప్రజానీకం సమస్యలను అజెండా చేసుకుని ఉత్తరాంధ్రలో అన్ని ప్రాంతాల్లోనూ పర్యటన సాగిస్తూ ప్రచారంలో ఆమె అగ్రభాగాన నిలిచారు. పట్టభద్రులను కలిసేందుకు సమస్యలపై చైతన్యపరుస్తూ వెళ్తోన్న క్రమంలో ప్రధాన రాజకీయ పార్టీలు అవలంభించే పద్ధతులైన కులం, ధనం వంటి దుష్ప్రభావాలను పిడిఎఫ్ అభ్యర్థి తూర్పారబట్టడం ప్రత్యేకతగా నిలిచింది. అధికార వైసిపి అంచనాలకు అందని రీతిలో టిడిపి 'పోల్ మేనేజిమెంట్' చేపట్టిందన్నది స్పష్టమవుతోంది.

టిడిపిలో కీలకపాత్ర పోషించిన 'ఇద్దరే ఇద్దరు'

ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల్లోని అన్ని ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల యాజమాన్యాలను ఐక్యం చేసేందుకు ఆయా అసోసియేషన్లకు డబ్బు పంపిణీలో మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, నారాయణ విద్యాసంస్థల అధినేత నారాయణ కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. వీరు కాపు కులానికి చెందిన వారు కావడంతో టిడిపి అధిష్టానం వద్ద వేపాడ చిరంజీవిరావిని ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి సూచిస్తూ గెలుపుకోసం కృషిచేశారు. వైసిపి అభ్యర్థిగా ఉన్న సీతం రాజు సుధాకర్‌కు గానీ, ఆ పార్టీకి గానీ మొట్టమొదటసారి ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనడంతో 'పోల్ మేనేజిమెంట్' చేయడంలోనూ, అసోసియేషన్లను పట్టుకుని నిలుపుకోవడంలోనూ వైఫల్యం చెందారు. టిడిపి మాదిరిగా పట్టభద్రుల ఓట్లను రాబట్టేందుకు అంతర్గతంగా ఈ వ్యవహారాలను చక్కబెట్టే అనుభవం గంటా, నారాయణ మాదిరిగా ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి నేతలెవ్వరూ చేయలేకపోయారు. అలా చేయగల నాయకుడైన మంత్రి బొత్స సత్యనారాయణ ఆ పనిచేయలేదని తెలుస్తోంది. విజయసాయిరెడ్డికి చేసే సత్తా ఉన్నా ఆయన్ను ఈ ప్రాంతం నుంచి పార్టీ అధిష్టానం తప్పించిందన్నది వైసిపి శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. అంతేగాక వాలంటీర్ల ద్వారా పట్టభద్రులకు డబ్బులు పంచుతూ పట్టుబడడం, ఆంధ్రాయూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలతో ప్రైవేట్ హోటల్‌లో విశాఖలో సమావేశం నిర్వహించబోయి ప్రజాసంఘాలు, మీడియాకు దొరికిపోవడం కూడా వైసిపిని నైతికంగా దెబ్బతీశాయి.

ప్రతినెలా 5లోగా వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతి నెలా ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థకు, స్వచ్ఛంద సంస్థలకు అప్పగించరాదని, ఈనెల 20న చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు బర్ల రాములమ్మ, ఇ.సరస్వతి పిలుపునిచ్చారు. మండలంలోని కర్రివలస వద్ద వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి కష్టాలు పడి మధ్యాహ్న భోజనాన్ని వేడి వేడి అన్నం పిల్లలకు అందించినా చాలీచాలని వేతనంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్యాస్ సరఫరా చేయాలని, యూనిఫారం అందించాలని, ప్రతినెలా 5లోపు వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని అన్నారు మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల చిన్నచూపు మానుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు చేస్తున్న పోరాటానికి కార్మిక సంఘాలన్నీ మద్దతు తెలపాలని, ఈనెల 20న జరిగే చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు లక్ష్మణరావు పాల్గొన్నారు.

బలిజిపేట : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వై.శాంతికుమారి అన్నారు. శనివారం ప్రజాసంఘాల కార్యాలయంలో ఆమె మధ్యాహ్నం భోజన నిర్వహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సందర్భాల్లో వివిధ మీటింగ్లలో మధ్యాహ్నం భోజనం నిర్వాహకుల సమస్యల గురించి ప్రభుత్వానికి వినతి పత్రాలు అందిస్తూ ధర్నాలు చేస్తూ నినాదాలు తెలుపుతున్న ప్రభుత్వం మాత్రం నెమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఎటువంటి గుర్తింపు లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు వారికి ఐడి కార్డులు, యూనిఫాం, కనీస వేతనం తదితర సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

కురుపాంలో విజయోత్సవ ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి విజయోత్సవ ర్యాలీలు

ప్రజాశక్తి -కురుపాం

ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా వేపాడ చిరంజీవి గెలుపొందిన సందర్భంగా స్థానిక తెలుగు యువత చందక రామకృష్ణ, సువ్వాన గోవిందనాయుడు ఆధ్వర్యంలో శనివారం నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో గల ధూళికేశ్వర ఆలయం నుంచి రావాడ జంక్షన్ వరకు మందుగుండ సామాగ్రి పేల్చుకుంటూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం టిడిపి కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి ఆశావాలు బిడ్డిక పద్మావతి, బిడ్డక తమ్మయ్య, మాజీ ఎంపిపి రమణమూర్తి, టిడిపి నాయకులు బిడ్డిక కడాయి, సువ్వాన వెంకటరమణ, బి.కొండలరావు టిడిపి నాయకులు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాలూరు : ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వైసిపి పతనానికి నాంది పలికినట్లేనని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి అన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి బలపర్చిన వేపాడ చిరంజీవిరావు ఘనవిజయం సాధించడంతో శనివారం ఆమె నివాసంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచుకున్నారు. రాష్ట్రంలో జగన్ రాక్షస పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసిపి పరాజయాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయన్నారు. వైసిపి ప్రభుత్వం ఎన్ని దొంగ ఓట్లు నమోదు చేసినా, అక్రమాలకు పాల్పడినా పట్టభద్రులు మేధావులు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, మక్కువ, పాచిపెంట మండలాల నాయకులు జి.వేణుగోపాల్, ఎం.సూర్యనారాయణ, యుగంధర్ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో టిడిపి తరపున పోటీ చేసి అఖండ మెజార్టీతో వేపాడ చిరంజీవి గెలుపొందడం పట్ల కురుపాం నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకురాలు బిడ్డిక పద్మావతి హర్షం వ్యక్తం చేశారు. చిరంజీవి గెలుపునకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, ఆశావాహులు సమిష్టిగా కృషి చేశామన్నారు. చిరంజీవి రావు గెలుపు వైసీపీ ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. రానున్న 2024 ఎన్నికల్లోనూ రాష్ట్రంలో టిడిపి భారీ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అంబేద్కర్ సామాజిక భవనానికి గ్రీన్ సిగ్నల్

పార్వతీపురంటౌన్ : కేంద్రంలో అంబేద్కర్ సామాజిక భవనం నిర్మించేందుకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఎపి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెలగపూడి సచివాలయంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి శుక్రవారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నాగార్జునను కలిసి యూనియన్ డైరీని అందజేసిన అనంతరం పలు సమస్యలను ప్రస్తావించినట్లు చెప్పారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో అంబేద్కర్ సామాజిక భవనం ఆవశ్యకతను గుర్తు మంత్రికి విజ్ఞప్తి చేశామన్నారు. ఇందుకు మంత్రి వెంటనే స్పందించి భవన నిర్మాణానికి అంగీకరిస్తూ ప్రతిపాదనలను పంపించాలని ఎమ్మెల్యే జోగారావును సూచించామన్నారు. తమ విజ్ఞప్తిపై తక్షణమే స్పందించిన సాంఘిక సంక్షేమ మంత్రి నాగార్జునకు, స్థానిక ఎమ్మెల్యే జోగారావుకు సామల కృతజ్ఞతలు తెలిపారు.

సదస్సులతో విద్యార్థులకు విషయ అవగాహన

పాలకొండ : విద్యార్థులకు సదస్సులు, ఉపన్యాసాల ద్వారా విషయ పరిజ్ఞానం పెరుగుతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.జనార్ధననాయుడు తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఖండావు బాలమురళీకృష్ణచే 'ఫండమెంటల్ ఆఫ్ కెమిస్ట్రీ' అనే అంశంపై అతిథి ఉపన్యాసం జరిగింది. అనంతరం అతిథి ఉపన్యాసకులు మాట్లాడుతూ విద్యార్థులు కెమిస్ట్రీ సబ్జెక్టుపై ఆసక్తి కలిగించడమే కాకుండా భవిష్యత్తులో రసాయన శాస్త్ర ప్రాముఖ్యత, దాని ద్వారా కలిగే ఉపాధి అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో కాలేజీ కోఆర్డినేటర్ బి.రాజు, రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్ కె.జగన్మోహనరావు, ఎం.ప్రశాంతి రూసా కోఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు, గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రఘువేంద్రనాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

ఘనంగా గ్లకోమా వారోత్సవాలు

సీతంపేట : ప్రతి జీవికి అన్ని అవయవాలు కన్నా ప్రధానమైనవి కళ్లని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో గ్లకోమా వారోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈనెల 12 నుంచి 18 వరకు గ్లకోమా వారోత్సవాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నేత్ర రోగులు వినియోగించుకోవాలన్నారు. కళ్ల ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని, దాన్ని రక్షించుకునే బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో నేత్ర వైద్య నిపుణులు రేఖ, వైద్యులు రాజేష్, వెంకట్రావు, ఆప్తాలమిక్ జానకిరావమ్మ తదితరులు పాల్గొన్నారు.

బోరుబావి ఏర్పాటుపై హర్షం

మక్కువ : మండలంలోని శంబర గ్రామపంచాయతీ పరిధిలోని ఎరగడవలస వెళ్లే రహదారిలో మంచినీటి బోరుబావి ఏర్పాటు చేయడంపై పలువురు ఎటర్నల్ లైట్ సంస్థను అభినందించారు. సుమారు లక్ష రూపాయల ఖర్చుతో బోరుబావిని ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఏర్పాటు చేశామని ఆ సంస్థ చైర్మన్ వెన్న విజయకుమార్ తెలిపారు. సర్పంచ్ సింహాచలమమ్మ చేతుల మీదుగా బోరుబావిని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ సంస్థ సిబ్బంది సుమన్, శశిభూషణరావు, ప్రజలు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న వెంకటవర్మ దంపతులు

తోటపల్లి దేవస్థాన పునర్నిర్మాణానికి రూ.20 లక్షలు సాయం

కురుపాం : విశాఖపటాన్నికి చెందిన మునగపాటి వైష్ణవి, వెంకటవర్మ దంపతులు తోటపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.20లక్షలు చెక్కును ట్రస్ట్ సభ్యులైన డాక్టర్ డి.పారినాయుడు, ద్వారపురెడ్డి ధనుంజయరావుకు శనివారం తోటపల్లి దేవస్థానానికి వచ్చి అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి రూ.20 లక్షలు అందజేయడం సంతోషంగా ఉందని, వారికి ఆలయ ట్రస్ట సభ్యుల తరుపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

సీతంపేట : మండలంలోని పెద్దూరు పంచాయతీ చింతమానుగూడలో సవర బాపన్నకు చెందిన పూరిల్లు శనివారం వేకువజామున దగ్ధమైన విషయం తెలుసుకున్న. టిడిపి నాయకులు పడాల భూదేవి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చీపుర్లే జీవనాధారంగా జీవిస్తున్న బాపన్న ఏడదంతా కష్టబడి సేకరించిన చీపుర్లు, నిత్యవసర సరుకులు, సామాన్లు, మూగజీవాలు అగ్నికి ఆహుతవ్వడంతో నిరాశ్రయుడయ్యాడని అన్నారు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై సంబంధిత అధికారులతో ఫోన్ చేసి మాట్లాడారు. ఆమె వెంట సీతంపేట మాజీ ఎంపిటిసి సభ్యులు బిడ్డక జయలక్ష్మి, స్థానిక నాయకులు ఉన్నారు.

ప్రారంభమైన రోడ్ల విస్తరణ పనులు

వీరఘట్టం : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి విస్తరణ పనులు శనివారం పున ప్రారంభమయ్యాయి. ఒట్టిగెడ్డ వంతెన నుంచి స్వామి థియేటర్ వరకు 1.2 కిలోమీటరు వరకు రూ.5.5కోట్లతో ఉపాధి హామీ ప్రధాన రహదారి విస్తీర్ణ పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే ఇరువైపులా కాలువల పనులు ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు జరిగాయి. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి స్వామి థియేటర్ వరకు కాలువ నిర్మాణ పనులు చేపట్టినందుకు జెసిబి ద్వారా తవ్వకాలు జరుపుతున్నారు. ప్రధాన రహదారి విస్తీర్ణ పనులు జరుగుతాయా లేదా? అని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇరువైపులా కాలువ నిర్మాణ జరిపేందుకు తవ్వకాలు చేయడంతో ప్రధాన రహదారి విస్తర్ణ పనులు ఊపందుకున్నట్లు ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.

వైసిపి నాయకుడి దాతృత్వం

కురుపాం : వైసిపి జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు విజయనగరం నుంచి కురుపాం కారులో వస్తుండగా నర్సిపురానికి పార్వతపురానికి మధ్యన వీరఘట్టం మండల సర్వేయర్ తన ద్విచక్ర వాహనంతో ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అపస్మాకర స్థితి ఉన్నారు. ఆయన్ను గమనించిన నాగేశ్వరరావు వెంటనే తన కారులో జిల్లా కేంద్రాస్పత్రికి తన తీసుకొని వెళ్లి వైద్య సేవలు అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందించారు.

క్షతగాత్రుడ్ని ఆస్పత్రికి తరలిస్తున్న నాగేశ్వరరావు

స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

పాలకొండ : స్థానిక నగర పంచాయతీ పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళలకు స్వచ్ఛత అవార్డులు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించే పద్ధతులు, చెత్తతో కళాకృతుల తయారీ, చెత్తతో సంపద తయారీ, పొడి చెత్తను వినూత్న రీతిలో వినియోగించడం, స్వచ్ఛతపై అవగాహన కల్పించడం, తడి చెత్త వినియోగంతో కంపోస్టు తయారీ మొదలగు విభాగాల్లో వీటిని అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈనెల 22లోగా నగర పంచాయతీ కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవార్డులను అందజేస్తామన్నారు.

విస్తృతంగా రైతు విజ్ఞాన కార్యక్రమాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం మండలం రస్తా కుంటుభాయి కృషి విజ్ఞాన కేంద్రం రైతుల కోసం చేపడుతున్న రైతు విజ్ఞాన కార్యక్రమాలు విస్తృతంగా ఉండాలని నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి. శ్రీనివాస్ అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మండలంలోని గోపాలపురం, పెద్దకర్జ, మంగళాపురం, తాడికొండ గ్రామాల్లో పర్యటించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నడుస్తున్న కృషి విజ్ఞాన కేంద్రాలు రైతులకు ప్రతినిత్యం అందుబాటులో ఉండేలా విజ్ఞాన కార్యక్రమాలు అందించాలన్నారు. నైరా వ్యవసాయకళాశాలలో విద్యనభ్యసిస్తున్న మండలానికి చెందిన పలువురు విద్యార్థుల స్వగ్రామాలకు వెళ్లి వారిని కలిసి పలు సూచనలు చేశారు. విద్యార్థులు చేపడుతున్న రావేప్, ఆర్‌బికెలకు సంబంధించిన కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులు భవిష్యత్తులో ఆర్థిక పురోభివృద్ధి సాధించాలంటే వ్యవసాయంతో పాటు అధిక లాభాలు వచ్చే పంటలను పండించాలని అన్నారు. అనంతరం ఆయన కృషి విజ్ఞాన కేంద్రంలో చేపడుతున్న పలు కార్యక్రమాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన వెంట కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్. టి ఎస్ ఎస్ కె పాత్రో, కెవికె వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.అనంత విహారి, నైరా వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ ఆఫ్ ఎగ్రోణమి అధ్యాపకులు డాక్టర్ ఉపేంద్ర రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేంద్ర కుమార్ తదితరులు ఉన్నారు.

ఆర్‌బికె సిబ్బందికి సూచనలు ఇస్తున్న కెవికె శాస్త్రవేత్తలు



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మున్సిపల్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సమస్యలు పరిష్కరించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పలు విభాగాలకు చెందిన ఉద్యోగులు శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైయ్యారు. మధ్యాహ్నం భోజన సమయానికి ముందు కార్యాలయ ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగ సంఘం అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు, ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర చైర్మన్, ఎపి రాష్ట్ర మున్సిపల్ ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ కృష్ణమోహన్ పిలుపు మేరకు ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈ నిరసన చేపట్టారు. ప్రభుత్వం నుంచి మున్సిపల్ ఉద్యోగులకు రావాల్సిన పిఆర్‌సి బకాయిలు, డిఎ బకాయిలు, లోన్స్, లీవ్ ఎన్క్యాష్మెంట్, ఒపిఎస్ సాధనకై పోరాటం చేస్తున్నామన్నారు.

స్వయం ఉపాధికి సువర్ణావకాశం

ప్రజాశక్తి - పాలకొండ

ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం ఖాదీ, గ్రామీణ పరిశ్రమ ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడానికే ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం ఎంతగానో దోహదపడుతుందని ఖాదీ, గ్రామీణ పరిశ్రమలశాఖ ఎడి ఐ.ధర్మారావు తెలిపారు. మండలంలోని అన్నవరంలోని అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్టు ఆవరణలో స్వయం ఉపాధికి రుణాలు - వాటి వినియోగంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతతో పాటు స్వయం ఉపాధి కోసం ఈ పథకం ద్వారా రుణాలు అందిస్తామన్నారు. సూక్ష్మ, మధ్య తరహ పరిశ్రమల స్థాపన ద్వారా స్వయంఉపాధితో పాటు మరికొందరికి జీవనోపాధి అవకాశాలు కల్పించవచ్చునని తెలిపారు. సబ్సిడీతో కూడిన రుణాలు పొంది వ్యాపారాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ పథకం ద్వారా వస్తువుల తయారీ, వస్తు సేవ పరిశ్రమలు స్థాపించుకోవాలన్నారు. వంద వరకు వివిధ రకాల యూనిట్లకు రుణాలు అందించేందుకు బ్యాంకులు కూడా ముందుకొస్తున్నాయని తెలిపారు. అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉపాధి కల్పన నిమిత్తం దరఖాస్తు చేసుకొనే వారు ఉచితంగా ట్రస్టు సేవలను వినియోగించుకోవచ్చునని ట్రస్టు చైర్మన్ గవర గురునాథరావు తెలిపారు. కార్యక్రమంలో ఎపి కెవిఐబి డిఇఒ ఎస్.రవికుమార్, జెఐ డి.శ్రీహరి, డిఆర్‌డిఎ ఎపిడి వై.సత్యంనాయుడు, ఎడి సీతారాం, కో ఆర్డినేటర్ వై.సత్యనారాయణ, జివిఎస్ ప్రసాద్, ఆర్.సూర్యప్రకాశ్, పలువురు లబ్ధిదారులు, వెలుగు ఆర్‌పిలు పాల్గొన్నారు.

వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో ఇంటి పన్ను 100శాతం మార్చి 31నాటికి వసూలు చేయాలని పాలకొండ డిఎల్‌పిఒ రాంప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వీధిలైట్ల నిర్వహణకు సంబంధించి సిసి చార్జీలు వసూలు జరగాలని అన్నారు, అలాగే గ్రామపంచాయతీలో గ్రామకంఠాల సుమిత్వ సర్వే వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడాలన్నారు. పంచాయతీలో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. చేత్త సంపద కేంద్రాలపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు లాంగ్‌టర్మ్ ఇంటర్న్‌షిప్

సీతంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల లాంగ్‌టర్న్ ఇంటర్న్‌షిప్ విజయవంతంగా ముగిసిందని ప్రిన్సిపల్ పి.జీవన్ జ్యోతి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆమె మాట్లాడుతూ థర్డ్ ఇయర్ విద్యార్థులు ఫిఫ్త్ సెమి ఫైనల్ లాంగ్‌టర్మ్ ఇంటర్న్‌షిప్ విజయవంతంగా ముగిసిందని అన్నారు. పోలీస్ స్టేషన్, సచివాలయం, ఆసుపత్రి, ఐటిడిఎ విభాగాల అధిపతులు విద్యార్థులకు బాగా సహకరించారని చెప్పారు విద్యార్థులు ఇంకా ముందంజలో ఉండాలన్నారు. కార్యక్రమంలో బోధకులు శంకరరావు, కిషోర్ తదితరులు ఉన్నారు

ఆర్.వెంకంపేటలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ఆర్.వెంకంపేటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం వైద్యాధికారి డాక్టర్ పి.ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భిణీలకు రక్తం తక్కువగా ఉన్నందున అందరికీ వైద్య పరీక్షలు చేసి తక్కువ ఉన్నవారి ఆరోగ్య పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకొని వారికి తెలియజేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. వారికి కావలసిన ఐరన్, కాల్షియం, మల్టీవిటమిన్ టాబ్లెట్లు ఇస్తూ ఆహారంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి సూచించారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, షుగర్, బిపి ఆస్తమా ఫిట్స్ మొదలైన వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యం అందించామని అన్నారు. ప్రజలు ఈ వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సిబ్బంది, 104సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ఉషారాణి

చిరుధాన్యాల సాగు పెంచాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రైతులు అపరాలు, చిరుధాన్యాల సాగు ఎక్కువ విస్తీర్ణం చేయాలని డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో అంతర్జాతీయ రూరల్ లైవ్లీ హుడ్ మిసన్ కార్యక్రమంలో భాగంగా గ్లోబల్ మిల్లెట్స్ ప్రమోషన్, ఎక్స్ పెన్షన్ లైవ్ ప్రోగ్రాం మండల రైతు ఉత్పత్తి దారుల సమాఖ్య రైతులతో సమావేశంలో మాట్లాడారు. చిరుధాన్యాల వల్ల ఆరోగ్యంతో పాటు ఆదాయం కలుగుతుందన్నారు. అలాగే సాగు చేసే రైతుల పెట్టుబడికి సమాఖ్య ద్వారా రుణాలు ఇవ్వడం, వారు పండించిన పంటలకు మార్కెటింగ్ కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇందుకు ప్రభుత్వం కూడా ఈ చిరుధాన్యాల సాగు, వాటి ఉపయోగాలు వ్యవసాయ అధికారుల ద్వారా రైతులకు తెలియపర్చి, అందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం కూడా అందిస్తుందని అన్నారు. ఈ అవకాశం రైతులు వినియోగించేలా సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డిపిఎం పి.ప్రవీణ్ కుమార్, ఎపిఎం పి.సురేష్, రైతు సమాఖ్య అధ్యక్షులు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు, సిసిలు పాల్గొన్నారు. తొలుత చిరు ధాన్యాల సాగుపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు.

బలిజిపేట: స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద చిరుధాన్య మహోత్సవ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం కె.ఉమామహేశ్వరరావు సమక్షంలో నిర్వహించారు. చిరుధాన్యాల ప్రాధాన్యతపై మహిళా సంఘసభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం పురవీధుల్లో సిరిధాన్యాల ఉపయోగం, వాడుక తదితర అంశాలపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిసిలు మురళి, దాసు, ఎస్‌హెచ్‌జి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని పెదబోరబంద రైతు భరోసా కేంద్రంలో వెలుగు ఎపిఎం సింహాచలం, మహిళ కిషన్ రైతులతో కలిపి ప్రధానమంత్రి గ్లోబల్ మిల్లెట్స్ ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రధానమంత్రి సందేశం మహిళకు వినిపించారు. కార్యక్రమంలో మహిళలు, సిసిలు రామకృష్ణ, సుమతి పాల్గొన్నారు

బలిజిపేటలో ర్యాలీ చేస్తున్న వెలుగు సిబ్బంది

నేడు జగనన్న విద్యా దీవెన నిధులు విడుదల

ప్రజాశక్తి - కలెక్టరేట్

జగనన్న విద్యా దీవెన నిధులు ఆదివారం విడుదల కానున్నాయని జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్ తెలిపారు. ఈ మేరకు శని వారం ఒక ప్రకటన జారీ చేశారు. జిల్లాలో 19,999 మంది విద్యార్థులు జగనన్న విద్యా దీవెన పథకానికి అర్హులని చెప్పారు. విద్యార్థుల తల్లులు 18,232 మంది ఖాతాల్లో రూ.11.57 కోట్లు జమ అవుతుందని ఆయన వివరించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి అధికారులు, విద్యార్థులు, తల్లులు పాల్గొంటారని ఆయన చెప్పారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండల కేంద్రంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శిపై దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం, జనసేన, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచి 25 రోజులుగా పారిశుధ్య పనులు జరగలేదని, కావున వెంటనే పారిశుధ్యం పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ దేవానంద్‌కు వినతిని అందజేశారు.

రేపు వాహనాల వేలంపాట

ప్రజాశక్తి - సాలూరు

వివిధ పోలీసు కేసుల్లో పట్టుబడిన ఆరు వాహనాల ను ఈనెల 20న వేలం వేయనున్నట్లు టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో నాలుగు ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలకు వేలం పాట నిర్వహించనున్నట్లు చెప్పారు. టౌన్ పోలీసు స్టేషన్ ఆవరణలో సోమవారం ఉదయం నిర్వహించనున్న ఈ వేలంపాట లో ఆసక్తి వున్న వ్యక్తులు పాల్గొనవచ్చునని సిఐ శ్రీనివాసరావు కోరారు.

చీకట్లో పలు గ్రామాలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

తుఫాన్ ప్రభావంతో గాలులు వీయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి గ్రామాలు చీకట్లో మగ్గుతున్నాయి. గురువారం నుంచి శనివారం వరకూ ఇదే పరిస్థితి. గాలులు వీచేసరికి విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను వెంటనే నిలిపివేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. వర్షం, గాలులు తగ్గిన తర్వాత కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంలో అధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు. ఈ ప్రాంతంలో భారీ గాలులు లేకపోయినా విద్యుత్ నిలిచిపోవడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంకిలి పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న ప్రజారోగ్యశాఖ ఎస్‌ఇ, సిబ్బంది

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

పాలకొండ: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని నగరంలో ప్రజలకు ఎటువంటి నీటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రజారోగ్యశాఖ పర్యవేక్షక ఇంజనీర్ కె.రాజారావు తెలిపారు. శనివారం స్థానిక నగర పంచాయతీకి విచ్చేసి ఆయన సంకిలి పంప్ హౌస్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం ఇస్తున్న నీటిశాతం తగ్గకుండా వుండేలా ఎక్కడికక్కడ నీటి నిల్వ, క్రాస్ బండ్లు అవసరాన్ని బట్టి గుర్తించి అందుకు తగ్గట్టుగానే పైప్‌లైన్, బోర్ వేల్స్ మెయింటైన్ పనులకు, మోటారు మరమ్మతులకు మెటీరియల్ కొనుగోలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఆయన వెంట విజయనగరం ఇఇ కె.దక్షిణా మూర్తి, కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఆఫీసర్, కె.నరసింగరావు, మున్సిపల్ ఎఇ దేవీవరప్రసాద్, టెక్నికల్ ఆఫీసర్ కె.ఫణికుమార్, మున్సిపల్ వార్డు ఏమినిటీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

పెరుగుతున్న జ్వర పీడితులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో రోజురోజుకు జ్వర పీడితుల సంఖ్య పెరుగుతుంది. వైద్యం కోసం వస్తున్న రోగులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. కలుషిత నీరు, ఉదయం వేళ దట్టమైన పొగ మంచు, తీవ్రమైన ఉష్ణోగ్రతలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇందులో ఎక్కువ మంది విద్యార్థులు, చిన్నారులు కనిపిస్తున్నారు. వైద్యం కోసం వస్తున్న రోగులకు సకాలంలో సేవలు అందిస్తున్నామని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యులు రవికుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాలకొండ : పట్టణంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పేకేటి రాంబాబు (18) మృతి చెందారు. లుంబూరులో ఇంటి నిర్మాణ పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా స్థానిక గాసి వీధి దగ్గర వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై ప్రమాద స్థలంలోనే మృతి చెందారు. ఎస్‌ఐ బి.శివప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తండ్రి తవిటయ్య పొలం పనులు చేస్తుండగా, తల్లి కొంత కాలం క్రితమే మరణించారు. రాంబాబు తాపీ పనులు చేస్తూ కుటుంబానికి అండగా ఉండేవారు.

మృతి చెందిన రాంబాబు